సాక్షి ఆదిలాబాద్


సోమవారం। 16। సెప్టెంబర్। 2024

అద్దెకు 'ఆహ్లాదం'



గణేశ్ ఉత్సవాల్లో భాగంగా పలు మండపాల వద్ద ఏర్పాటు చేసిన మొక్కలు ఆక ర్షిస్తున్నాయి. పచ్చదనంతో పాటు ఆహ్లాదం పంచుతున్నాయి.

9లో▸



రక్షిద్దాం..రక్షించుకుందాం

సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల నుంచి భూమిని రక్షిస్తున్న ఓజోన్ పొర క్రమంగా క్షీణిస్తోంది. నేడు ఓజోన్ దినోత్సవం సందర్భంగా కథనం.

8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/24.0

వాతావరణం

పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

నిమజ్జనోత్సవంలో బాణాసంచా కాల్చొద్దు

- డీఎస్పీ జీవన్ రెడ్డి
- చివరిరోజు 300 గణపతుల నిమజ్జనం



మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: గణేశ్ నిమజ్జనం సందర్భంగా బాణాసంచా కాల్చొద్దని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో 600 మంది సిబ్బందితో నిమజ్జన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ, డ్రోన్‌లతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మంగళవారం చివరిరోజు పట్టణంలో 300 గణపతుల విగ్రహాలు నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శోభాయాత్రలో బాణాసంచా కాల్చడానికి అనుమతి లేదన్నారు. వేడుకలను తిలకించేందుకు పెద్ద ఎత్తున జనం వస్తారని, ప్రమాదం సంభవించే అవకాశం ఉండడంతో వాటిని నిషేధించినట్లు పేర్కొన్నారు. డీజే యజమానులు పరిమితికి మించి సౌండ్‌సిస్టమ్ ఏర్పాటు చేయకూడదని తెలిపారు. ఎలక్ట్రిక్ వైర్ల వద్ద జాగ్రత్తలు పాటించాలని, నిమజ్జనం రోజున వాహన డ్రైవర్లు మద్యం సేవించకూడదన్నారు. ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి బ్రీత్ అనలైజర్ ద్వారా టెస్టులు నిర్వహిస్తామని తెలిపారు. పట్టణంలోని వినాయక్ చౌక్, దేవిచంద్ చౌక్, గాంధీ చౌక్, అంబేద్కర్‌చౌక్, నేతాజీ చౌక్ ప్రదేశాల్లో భారీ వాహనాలకు అనుమతి లేదని, ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు వివరించారు.

హోరియా ఖేల్ ప్రదర్శన



ప్రదర్శనలో మథుర సమాజ్ సభ్యులు

బోథ్: గణేశ్ నిమజ్జనం సందర్భంగా మండలంలోని సొనాలతో పాటు సమీపంలోని ఆయా గ్రామాల్లో మథుర సమాజ్ వారు ఆదివారం హోరియా ఖేల్ కార్యక్రమం నిర్వహించారు. యువకులు నృత్యాలతో సందడి చేశారు.



నా పేరు పార్వతి రాథోడ్. భర్త పేరు సంజయ్. మాది గురుజ్ గ్రామం. మాకు ముగ్గురు పిల్లలు. ముగ్గురూ కిడ్నీ వ్యాధితోనే చనిపోయిండ్రు. ఒక ఆడపిల్ల, ఇద్దరు చేతి కొచ్చిన కొడుకులు నాలుగేళ్లలోనే మరణించడంతో మేము పిల్లలు లేకుండా అయ్యాం. మామయ్య కూడా కిడ్నీ వ్యాధితోనే చనిపోయిండు. అత్తమ్మ మంగ్లీబాయిదీ అదే సమస్య. మంచానికే పరిమితమైంది. ఇంట్లో నా భర్త, నేను తప్పా మిగతా వారందరికీ కిడ్నీ వ్యాధి సోకింది. పిల్లల వైద్యం కోసం ఉన్న భూమిని అమ్మేశాం. ఇంటిని సైతం అమ్మి వైద్యం చేయించినా వాళ్లు బతకలేదు. ప్రస్తుతం మా మరిది ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నాం.

అత్తతో పార్వతి రాథోడ్



నా పేరు దేవుబాయి. గురుజ్ గ్రామం. మాది పేద కుటుంబం. నా భర్త భూమన్న క్యాన్సర్‌తో మూడేళ్ల క్రితం చనిపోయిండు. ముగ్గురు ఆడపిల్లలు, ఒక కొడుకు. అందరికీ పెండ్లిళ్లు అయినయ్. నేను ఆరు నెలల నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నా. కరీంనగర్‌లో వైద్య పరీక్షలు చేయించుకుంటే బోరు నీళ్ల కారణంగా రెండు కిడ్నీలు పాడైనట్లు డాక్టర్లు చెప్పారు. ప్రస్తుతం ఏ పనిచేయట్లేదు. మంచానికే పరిమితం కావాల్సి వస్తంది. కుటుంబం గడవడం కష్టంగా మారింది. నా భర్త చనిపోయినా నాకు పింఛన్ రావట్లేదు. వైద్యం చేయించుకునేందుకు డబ్బులు లేక తిప్పలైతంది.

నా పేరు కేంద్రె సీతారాం. గురుజ్ గ్రామం. 12 ఏళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నా. వారం పది రోజుల నుంచి పరిస్థితి తీవ్రంగా ఉంది. నడవలేక పోతున్నా. శ్వాస ఆడట్లేదు. మాది వ్యవసాయ కుటుంబం. నాకు ఇద్దరు కొడుకులు, ముగ్గురు బిడ్డలు. అందరి పెండ్లిళ్లు అయినయ్. మా ఊరిలో బోరు నీళ్లు తాగడంతోనే నా కిడ్నీలు చెడిపోయాయి. నాతో పాటు మా గ్రామంలో చాలా మందిదీ ఇదే పరిస్థితి.





నా పేరు పెందూర్ రవి. మాది గురుజ్ గ్రామపంచాయతీ పరిధిలోని గూడెం. వారం పది రోజుల నుంచి కాళ్లు, ముఖం వాపులు రావడంతో డాక్టర్ దగ్గరికి వెళితే కిడ్నీలు చెడిపోయాయని చెప్పారు. నాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలీనాలి చేసుకొని బతికేటోళ్లం. ప్రస్తుతం మంచానికే పరిమితం కావడంతో కుటుంబం గడవని పరిస్థితి. మాకు వ్యవసాయ భూమి కూడా లేదు. మా పెదనాన్న కూడా మూడేళ్ల క్రితం కిడ్నీ వ్యాధితోనే చనిపోయాడు. మా గ్రామంలో చేతిపంపు నీరు తాగడంతోనే ఈ పరిస్థితి ఉందని తెలుస్తుంది. సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం.

గురుజ్.. కిడ్నీ ఫెయిల్!

- గాలిలో కలుస్తున్న ప్రాణాలు
- ఒకే ఇంట్లో ఏకంగా నలుగురు మృతి.. వ్యాధి బారిన మరొకరు
- ప్రస్తుతం గ్రామంలో 20 మందికి పైగానే బాధితులు
- చేతిపంపు నీరే కారణమంటున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు



గుడిహత్నూర్ మండలంలోని గురుజ్ గ్రామం

ఆదిలాబాద్‌టౌన్: కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గుడిహత్నూర్ మండలం గురుజ్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఊరిలో 270 కుటుంబాలున్నాయి. దాదాపు 1100 జనాభా ఉంది. ఇక్కడ కిడ్నీ బాధితులే ఎక్కువగా దర్శనమిస్తారు. వ్యాధి బారిన పడి ఇప్పటికే పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారు. అయినప్పటికీ అధికారులు తమ గ్రామంపై దృష్టి సారించడం లేదని పేర్కొంటున్నారు స్థానికులు. గ్రామంలో ఎక్కువగా కూలీ పనిచేస్తూ జీవనం సాగించేవారే ఉన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి వారిది. ఏజెన్సీ ప్రాంతమైన ఈ ఊరిలో తాగునీటి కారణమో, లేదా మరే ఇతర సమస్య ఉందో తెలియదు కానీ.. ప్రస్తుతం దాదాపు 20 మందికి పైగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. కొందరు ఆస్తులు అమ్మి ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటుండగా, మరికొంత మంది ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని దుస్థితి. మరోవైపు గ్రామంలో చాలా ఇళ్లలో కిడ్నీ సమస్యల గోడే వినిపిస్తోంది. ఒక ఇంట్లో ఈ వ్యాధి ఏకంగా నలుగురిని పొట్టనపెట్టుకోవడం చూస్తే కన్నీళ్లు రాక మానదు.

కిడ్నీల పాత్ర ఎంతో కీలకం..

శరీరమనేది ఓ సజీవ యంత్రం. వ్యర్థాలను బయటకు పంపడంలో మూత్రపిండాల పాత్ర కీలకం. అయితే ఆ వ్యర్థాలు నిండిపోయి శరీరంలో ఉంటే ప్రాణాపాయం తప్పదు. గురుజ్ గ్రామంలో ప్రస్తుతం కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. కలుషిత నీరు, పెయిన్ కిల్లర్లు అధిక మోతాదులో తీసుకోవడం, ఇతర కారణాలతో మూత్రపిండాలపై ప్రభావం చూపుతుందని తెలుస్తోంది. ఈ వ్యాధి బారిన పడినవారు ఎలాంటి పని చేయకుండా మంచానికే పరిమితం అవుతున్నారు.

పెరుగుతున్న బాధితుల సంఖ్య..

గ్రామంలో రోజురోజుకు కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. వయస్సుతో సంబంధం లేకుండా పదుల సంఖ్యలో వ్యాధి బారిన పడుతున్నారు. సంజయ్–పార్వతి దంపతుల ముగ్గురు పిల్లలతో పాటు అతడి తండ్రి కూడే కిడ్నీ వ్యాధితోనే మరణించడం గమనార్హం. అలాగే ఉద్దవ్, లస్మన్నతో పాటు మరికొంత మంది సైతం ఈ వ్యాధితోనే మృతిచెందారు. ప్రస్తుతం జాదవ్ శంకర్, జాదవ్ ఫకీర్‌రావు, కుమ్ర అన్నపూర్ణ, ఆత్రం అమృత్‌రావు, పెందూర్ రవీందర్, నైతం నారాయణ, మడావి జంగు, దేవుబాయిలు..



ఇలా దాదాపు 20 మంది వరకు వ్యాధితో బాధపడుతున్నారు. వైద్యశాఖ ప్రత్యేకంగా శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తే మరికొంత మంది బాధితులను గుర్తించే అవకాశం ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

చేతిపంపు నీరే కారణమా?



గ్రామంలోని చేతిపంపు

ఈ ఊరిలో ఎక్కువ మంది చేతిపంపు నీరే తాగుతున్నారు. అక్కడ ప్యూరిఫై కేంద్రం ఉన్నప్పటికీ నిర్వహణ సరిగా లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇంకొంత మంది తమ ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మన్నూర్ నుంచి వాటర్ క్యాన్‌కు రూ.20 చొప్పున చెల్లించి తెచ్చుకుంటున్నట్లు పేర్కొంటున్నారు. గత్యంతరం లేనివారు చేతిపంపు నీటినే తాగాల్సి వస్తోందని చెబుతున్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు చేస్తాం

గురుజ గ్రామంలో కిడ్నీ బాధితుల విషయం నా దృష్టికి రాలేదు. మండల వైద్యాధికారిని అక్కడికి పంపించి వైద్య శిబిరం ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం. వ్యాధిగ్రస్తులు పెరగడానికి కారణాలను తెలుసుకుంటాం. బాధితులకు వైద్య సేవలు అందిస్తాం.

– కృష్ణ, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి

గణనాథుడికి కలెక్టర్ పూజలు



వినాయకుడి మండపంలో పూజలు చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కై లాస్‌నగర్: రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడికి కలెక్టర్ రాజర్షి షా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిమజ్జన శోభాయాత్రను సాయంత్రం అట్టహాసంగా నిర్వహించారు. రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని నృత్యాలతో సందడి చేశారు.



రెవెన్యూ అధికారులు, ఉద్యోగులతో కలెక్టర్

ఐదు కొత్త జీపీలు.. 36 వార్డులు

కైలాస్‌నగర్: జిల్లాలో మరో ఐదు కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. ఇప్పటి వరకు 468 జీపీలు ఉండగా తాజాగా మరో ఐదు కొత్తవి ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన గెజిట్‌ను సైతం విడుదల చేసింది. దీంతో జిల్లాలోని జీపీల సంఖ్య 473కు చేరింది. ప్రస్తుతం పంచాయతీ పోరుకు రంగం సిద్ధం అవుతున్న తరుణంలో ఓటర్ల వారీగా వార్డుల పునర్విభజన చేపట్టాలని ఎస్ఈసీ ఆదేశించింది. ఈ మేరకు కసరత్తు చేపట్టిన కార్యదర్శులు కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో ఓటర్ల సంఖ్యకనుగుణంగా వార్డులను ఏర్పాటు చేశారు. మూడు పంచాయతీల్లో ఎనిమిదేసి చొప్పున ఉండగా మరో రెండు పంచాయతీల్లో ఆరు వార్డులను ఏర్పాటు చేశారు. దీంతో జిల్లాలోని వార్డుల సంఖ్య 3,870కు చేరింది. వాటికి సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను సైతం విడుదల చేశారు. కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లోని సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. దీంతో ఆయా పదవుల సంఖ్య పెరగనుంది.

మండలం	కొత్తగా ఏర్పడిన పంచాయతీ	వార్డులు
తలమడుగు	పూనగూడ	8
బజార్‌హత్నూర్	యేసాపూర్	6
తాంసి	అట్నంగూడ	6
ఇచ్చోడ	ఎల్లమ్మగూడ	8
ఉట్నూర్	వడగల్పూర్– కే	8

నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరుపుకోవాలి

- వెయ్యి మంది సిబ్బందితో బందోబస్తు
- 200 సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీతో పర్యవేక్షణ
- మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: గణేశ్ నిమజ్జనోత్సవంను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన పోలీసు అతిథిగృహంలో సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. పట్టణంలో గణేశ్ నిమజ్జన రూట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ, ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమానికి వెయ్యి మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణాన్ని ప్రత్యేక సెక్టార్లను విభజించి ఎస్సై స్థాయి అధికారులను కేటాయించినట్లు పేర్కొన్నారు. సీఐ స్థాయి అధికారులు పెట్రోలింగ్, గస్తీ నిర్వహిస్తూ పర్యవేక్షించాలని ఆదేశించారు. పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీడియోగ్రఫీ ద్వారా 24 గంటల పాటు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎస్పీ గౌస్ ఆలం, అదనపు ఎస్పీ సురేందర్ రావు, డీఎస్పీలు ఎల్.జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, సురేందర్ రెడ్డి, ప్రసాద్, సీఐలు సునీల్ కుమార్, కరుణాకర్, శ్రీనివాస్, ప్రణయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

జై గణేశా..



అర్లిలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



గణనాథున్ని నిమజ్జనానికి తరలిస్తున్న బృందావన్ గణేశ్ మండలి నిర్వాహకులు

గణేశ్ నిమజ్జనోత్సవాన్ని జిల్లాలో పలుచోట్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలందుకున్న వినాయకుడిని డీజే చప్పుళ్ల నడుమ శోభాయాత్రగా నిమజ్జనానికి తరలించారు. గణేశ్ మహరాజ్‌కీ జై అంటూ ముందుకు సాగారు. – ఆదిలాబాద్

వంట గ్యాస్ పక్కదారి

- సబ్సిడీ సిలిండర్లను కమర్షియల్‌గా..
- నిబంధనలకు విరుద్ధంగా వినియోగం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

జిల్లాలో వంట గ్యాస్ కనెక్షన్ల వివరాలు..
గ్యాస్ ఏజెన్సీలు : 17
సింగిల్ సిలిండర్ : 1,01,462
డబుల్ సిలిండర్ : 37,623
ఉజ్వల గ్యాస్ : 36,098



బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్‌లో వినియోగిస్తున్న వంటగ్యాస్ సిలిండర్లు

కైలాస్‌నగర్: జిల్లాలో సబ్సిడీ వంట గ్యాస్ పక్కదారి పడుతోంది. గృహావసరాల నిమిత్తం వాడాల్సిన సిలిండర్లను కొంతమంది వ్యాపారాలకు వినియోగిస్తున్నారు. వాణిజ్య సిలిండర్ ధర ఎక్కువగా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం పేదలకు రూ.500కే సబ్సిడీపై అందజేస్తోంది. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న పలువురు గృహావసర సిలిండర్లను పక్కదారి పట్టిస్తున్నారు. వాణిజ్య సిలిండర్లు ఒకటి రెండు కనిపించేలా ఉంచుతూ వీటిని దొడ్డిదారిన వినియోగిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది.

ఇదీ పరిస్థితి

వంటగ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారులకు ప్రభుత్వం 14.2 కిలోల సిలిండర్‌ను ఆయా ఏజెన్సీల ద్వారా అందజేస్తోంది. దీని ప్రస్తుత ధర రూ.882. అయితే తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.500కే అందజేస్తూ, రాయితీ మొత్తాన్ని లబ్ధిదారు ఖాతాలో జమ చేస్తుంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం మరో రూ.42ను సబ్సిడీగా చెల్లిస్తోంది. ఇక వ్యాపారాల కోసం వినియోగించే కమర్షియల్ సిలిండర్ (19 కేజీల) ధర ప్రస్తుతం రూ.1,960గా ఉంది. డొమెస్టిక్‌తో పోల్చితే ధర రెట్టింపునకు పైబడి ఉండడంతో పలువురు వ్యాపారులు గృహావసర సిలిండర్ల అక్రమ వినియోగానికి మొగ్గుచూపుతున్నారు.

దొడ్డి దారిన ఇలా..

జిల్లాలోని రెస్టారెంట్లు, హోటల్స్, దాబాలు, టీ క్యాంటిన్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు, ఫుడ్ కోర్టులు వంటి తదితర ప్రైవేట్ వ్యాపారాలకు సంబంధించి నిబంధనల ప్రకారం కమర్షియల్ సిలిండర్లనే వినియోగించాల్సి ఉంటుంది. అయితే చాలావరకు వ్యాపార సంస్థల్లో సబ్సిడీ సిలిండర్లనే వినియోగిస్తున్నారు. ఒకటి, రెండు కమర్షియల్ సిలిండర్లు బయటకు కన్పించేలా ఉంచుతూ లోపల తమ పని కానిచ్చేస్తున్నారు. గృహావసర సిలిండర్లు సబ్సిడీపై రావడంతో కొంతమంది వ్యాపారులు పేదల అమయాకత్వాన్ని ఆసరాగా చేసుకుని వారి సిలిండర్లను వినియోగిస్తున్నారు. ఇంకొంతమంది రూ. ఓ వంద అదికంగా ఇచ్చి పేదల నుంచి సిలిండర్లను తీసుకుంటున్నారు. ఇలా సబ్సిడీ గ్యాస్ పక్కదారి పడుతోంది. ఫలితంగా ప్రతి నెలా కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమవుతున్నట్లు తెలుస్తోంది.



జ్యోతిబాపూలే చౌక్‌లోని ఓ హోటల్‌లో ఇలా..

నామమాత్రంగా.. ఎన్‌ఫోర్స్‌మెంట్

వ్యాపార సంస్థల్లో అక్రమంగా వినియోగిస్తున్న సబ్సిడీ గ్యాస్‌ను కట్టడి చేయాల్సిన జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు ప్రతీ మండలానికి ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు ఉన్నప్పటికీ వారు 'మామూలు'గా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది.

వంటగ్యాస్ వినియోగిస్తే కఠినచర్యలు

ప్రభుత్వం గృహావసరాల కోసం అందించే సబ్సిడీ సిలిండర్లను వ్యాపారాలకు వినియోగించొద్దు. అలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. సిలిండర్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు 6ఏ కేసులు నమోదు చేస్తాం. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లతో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తాం.

–వాజీద్ అలీ, జిల్లాపౌరసరఫరాలశాఖ అధికారి

క్లుప్తంగా

వర్షాలకు కూలిన ఇల్లు



లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామంలో ఆదివారం ఇల్లు కూలింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అల్లేపు మల్లేశ్ ఇల్లు కూలిందని, ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు మల్లేశ్ కోరారు.

ఈత చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు



చికిత్స పొందుతున్న రాజాగౌడ్

నెన్నెల: మండలంలోని చిన్నవెంకటాపూర్‌కు చెందిన గీత కార్మికుడు పోతునూరి రాజాగౌడ్ ఆదివారం ఈత చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. వెన్నుపూసకు తీవ్ర గాయమైందని వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేయగా కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. క్షతగాత్రుడిని ప్రభుత్వం ఆదుకుని పరిహారం అందజేయాలని గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కొయ్యడ మల్లాగౌడ్ కోరారు.

కొండచిలువ పట్టివేత



అడవిలో వదులుతున్న యువకుడు

తానూరు: మండలంలోని సింగన్‌గాం గ్రామ సమీపంలో లక్ష్మణ్ పోతన్నకు చెందిన సోయా పంటలో ఆదివారం భారీ కొండ చిలువ కనిపించింది. పంటలో పనులు చేస్తుండగా కూలీలు, రైతులు చూసి పరుగులు తీశారు. వెంటనే పాములు పట్టే సహభాజ్‌కి ఫోన్‌లో సమాచారం అందించారు. ఆయన అక్కడికి చేరుకుని కొండ చిలువను పట్టుకుని అటవీ ప్రాంతంలో వదలిపెట్టారు.

వాటర్ ట్యాంకు పైనుంచి పడి వ్యక్తి మృతి



మల్లేశ్ మృతదేహం

జైపూర్: మండలంలోని షెట్‌పల్లి గ్రామానికి చెందిన గోలాడ మల్లేశ్ (37) వాటర్ ట్యాంకుపై నుంచి పడి మృతి చెందగా ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మల్లేశ్ గోదావరి నదిలో చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నాడు. మూడు నెలల కిందట భార్య సుమలత పుట్టింటికి వెళ్లింది. అప్పటినుంచి మద్యానికి బానిసయ్యాడు. వారం రోజులుగా మద్యం తాగుతున్నాడు. రెండురోజుల క్రితం గ్రామంలో వాటర్ ట్యాంకు ఎక్కే క్రమంలో కింద పడిపోయి మృతి చెందాడు. ఆదివారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



పట్టుబడిన పశువులు

రెబ్బెన: మహారాష్ట్రలోని ధనోరా నుంచి లారీలో నిజామాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని పుంజుమేరగూడ వద్ద జాతీయ రహదారి వద్ద ఆదివారం పెట్రోలింగ్ చేస్తుండగా పక్కా సమాచారంతో ఆసిఫాబాద్ వైపు నుంచి వస్తున్న లారీని ఆపి తనిఖీ చేస్తే 20 ఎద్దులు, 15 ఆవులు ఉన్నాయి. పశువులను తరలిస్తున్న వ్యక్తులను విచారించగా మహారాష్ట్రలోని గడ్‌చందూర్‌లోని సాధిక్ చెందిన పశువులను లారీలో తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారు. సాధిక్‌తోపాటు లారీ డ్రైవర్ మహ్మద్ హతం, క్లీనర్ సయ్యద్ వాహిబ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న పశువులను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించి, లారీని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.


రక్షిద్దాం.. రక్షించుకుందాం

- క్షీణిస్తున్న ఓజోన్ పొర
- పర్యావరణహిత కార్యక్రమాలతోనే పరిరక్షణ
- నేడు ప్రపంచ ఓజోన్ దినోత్సవం

ఆదిలాబాద్: మానవ చర్యల మూలంగా ప్రకృతి విధ్వంసానికి కారణమవుతున్నాడు. భూమిని సూర్యుడి నుంచి వచ్చే అతినీల లోహిత కిరణాల నుంచి రక్షిస్తున్న ఓజోన్ పొరపై పరోక్షంగా దాడి చేస్తూ, దాని ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నాడు. చివరికి తన మనుగడకు ముప్పు కొని తెచ్చుకుంటున్నాడు. భూమిపై గల వాతావరణ పొరల్లో స్ట్రాటోపియర్లో వాయురూపంలో విస్తరించే ఉండే ఓజోన్ పొర క్షీణత జీవజాలంపై పెను ప్రభావం చూపుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని దాని పరిరక్షణ ధ్యేయంగా ఏటా సెప్టెంబర్ 16న ప్రపంచ ఓజోన్ దినోత్సవం జరుపుకొంటున్నాం. ఈ సందర్భంగా సాక్షి కథనం.



ఆదిలాబాద్ జిల్లాలోని అటవీ ప్రాంతం



2024 ఓజోన్ డే థీమ్

ఉమ్మడి జిల్లా అటవీ ముఖచిత్రం..
ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా 2021 నివేదిక ప్రకారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా.. తెలంగాణలోని అత్యధిక అటవీ విస్తీర్ణాన్ని కలిగి ఉంది. 5,743.40 చదరపు కి.మీ మేర (35.66 శాతం) అడవులు విస్తరించి ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా 54.41 శాతంతో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రథమ స్థానంలో ఉండగా, మంచిర్యాల 45.15, ఆదిలాబాద్ 42.79, నిర్మల్ 32.62 శాతాలతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. అత్యధిక అటవీ విస్తీర్ణంతో ఉమ్మడి జిల్లా ఓజోన్ పునరుద్ధరణకు పరోక్ష కారణమవుతోంది.

ఓజోన్ అంటే..
భూమిని ఆవరించి ఉన్న వాతావరణ పొరల్లో ఓజోన్ అనేది 16 నుంచి 55 కి.మీ మేర విస్తరించి ఉన్న స్ట్రాటో స్ఫియర్లో ఉంటుంది. భూమి చుట్టూ ఆవరించి ఉండే మొదటి పొర ట్రోపోస్ఫియర్లోని ఆక్సిజన్(ఓ2) అణువులు రూపాంతరం చెంది స్ట్రాటోస్ఫియర్లో ఓ3 అణువులుగా మారుతాయి. ఈ ఓ3ని ఓజోన్ వాయువుగా వ్యవహరిస్తారు. ఈ అణువులన్నీ ఓజోన్ పొరగా ఏర్పడతాయి. సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలు భూమిపై చేరకుండా అడ్డుకుంటాయి. ఈ విధంగా భూమిపై ఉన్న జీవజాలానికి ఎలాంటి నష్టం కలగకుండా ఓ రక్షణ కవచంలా ఓజోన్ పొర ఉంటుంది. అయితే మనిషి అనాలోచిత చర్యలతో ఓజోన్ పొరకు రంధ్రాలు ఏర్పడుతుండడం కలవరపాటుకు గురిచేస్తోంది.

ప్రధాన కారణాలివే..
ఓజోన్ పొర సన్నగిల్లడానికి ప్రధాన కారణంగా క్లోరోఫ్లోరో కార్బన్లు (సీఎఫ్‌సీ) నిలుస్తున్నాయి. వీటి వల్ల మానవాళికే కాకుండా సమస్త జీవరాసులపైన తీవ్ర ప్రభావం పడుతున్నాయి. రిఫ్రిజిరేటర్, ఏసీలు వంటి వాటిల్లో వినియోగిస్తున్న సీఎఫ్‌సీలు, హైడ్రో సీఎఫ్‌సీలు వాతావరణంలో పేరుకుపోయి స్ట్రాటోస్ఫియర్లో గల ఓజోన్‌తో చర్య పొంది ఆ అణువులను విడగొట్టి ఆక్సిజన్‌లా మారుస్తున్నాయి. పొరలో ఓ3 అణువులు ఓ2 వాయువుగా మారుతుండడంతో ఓజోన్ పలుచబడుతోంది. పంటలపై చల్లే స్ప్రే, ఫోమ్, డిటర్జెంట్లు, ప్లాస్టిక్ వస్తువుల తయారీ, రిఫ్రిజిరేటర్ల తదితర వినియోగంతో క్లోరోఫ్లోరో కార్బన్లు వాతావరణంలోకి విడుదలవుతున్నాయి. అదే విధంగా బ్రోమిన్ సైతం ఓజోన్ పొరను ఛిద్రం చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది.

అనేక దుష్ఫలితాలు..
ఓజోన్ పొర క్షీణిస్తుండడంతో అతినీలలోహిత కిరణాలు భూమిపైకి చేరుతున్నాయి. దీంతో మనుషుల్లో చర్మ సంబంధ వ్యాధులు, రోగ నిరోధక శక్తి తగ్గడం, కంటి సంబంధ వ్యాధులు, చర్మ, క్యాన్సర్ బారినపడే అవకాశం ఉంది. జంతువులపై ఇవి మరింత తీవ్ర పరిణామాలు చూపుతున్నాయి. అలాగే మొక్కల్లో కిరణజన్య సంయోగ క్రియ రేటు తగ్గి మొక్కల ఆహార తయారీలో ఆటంకాలు ఏర్పడే అవకాశాలు ఉంటాయి. సముద్ర జీవజాలంపై పరోక్షంగా ఈ ప్రక్రియ ప్రభావితం చూపిస్తుందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరిగి, భూమి అగ్నిగోళంలా మారుతుందనే హెచ్చరికలు లేకపోలేదు.

బీసీ కమిషన్ సభ్యురాలికి సన్మానం



లక్ష్మిని సన్మానిస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: తెలంగాణ బీసీ కమిషన్ సభ్యురాలు, ఓయూ జేఏసీ నేత రంగు బాల లక్ష్మిని ఆదివారం హైదరాబాద్‌లో నిర్మల్‌కు చెందిన గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. తెలంగాణ ఉద్యమకారిణి లక్ష్మిని బీసీ కమిషన్ సభ్యురాలిగా నియమించడం హర్షనీయమని కొనియాడారు. నాయకులు అమరవేణి నర్సాగౌడ్, అనుములభాస్కర్ తదితరులు ఉన్నారు.

ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన మద్దుల రాకేశ్ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గుర్తుతెలియని దుండగులు చొరబడి రూ.10వేల నగదుతోపాటు గ్యాస్ సిలిండర్‌ను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లిరూరల్: పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల (పొలాస) జగిత్యాల విద్యార్థులు అన్నారు. మండలంలోని ఆకెనపల్లిలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా పంటల సాగుపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. పీపీఈ కిట్లు, చేతులకు గ్లౌజులు ధరించి పొలాల్లో రసాయనిక మందులు, ఎరువులు పిచికారి చేయాలన్నారు. పిచికారి అనంతరం మందు డబ్బాలను భూమిలో పాతి పెట్టాలన్నారు. అధిక మోతాదులో రసాయనిక ఎరువులు పిచికారి వల్ల దిగుబడి తగ్గుతుందని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ, కృషి విజ్ఞాన కేంద్రం అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ అధిక దిగుబడి పొందాలన్నారు. విద్యార్థులు తిరుపతి, శ్రీధర్, పవన్, మణిదీప్, నవతేజ్, నరేశ్, రైతులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో పలువురు ఆత్మహత్య



ఓర్సు రాజు (ఫైల్)

బావిలో దూకిన వ్యక్తి..
గుడిహత్నూర్: ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో పలువురు ఆత్మహత్య చేసుకున్నారు. బోథ్ మండలం కొత్త గ్రామానికి చెందిన ఓర్సు రాజు (39) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తితో వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. రాజు 15 ఏళ్ల క్రితం గుడిహత్నూర్‌కు చెందిన లలితను వివాహం చేసుకుని ఇక్కడే స్థిరపడ్డాడు. భార్యాభర్తలు ఇద్దరూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో చిన్నవాడు పుట్టుకతో దివ్యాంగుడు కావడంతో రాజు తరచూ బాధపడేవాడు. దీనికితోడు రాజుకు అనారోగ్య సమస్యలు తలెత్తాయి. తీవ్ర మనస్తాపంతో శనివారం రాత్రి గుడిహత్నూర్‌లోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బలిరాం పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరు..
కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సర్‌సిల్క్‌కాలనీకి చెందిన అశోక్ యాదవ్ జీవితంపై విరక్తితో ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై సుధాకర్ కథనం ప్రకారం..అశోక్ యాదవ్ (42) గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తితో ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతుడి భార్య సరస్వతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకుని ఒకరు..
భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన ఎర్రన్న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఎర్రన్న (40) మద్యానికి బానిసై ప్రతీరోజు కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. శనివారం భార్య హంసతో గొడవకు దిగాడు. ఆమె మనస్తాపంతో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. ఆదివారం చికిత్సపొందుతున్న భార్య హంస వద్దకు వచ్చి మరోసారి గొడవపడి ఇంటికి వెళ్లాడు. హంస చీరలను తగులబెట్టి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి కుమారుడు మహేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అడ గ్రామంలో వివాహిత..
ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని అడ గ్రామానికి చెందిన వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాజేశ్వర్ కథనం ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం హుడే గంగుబాయి (28) బట్టలు ఉతకడానికి వెళ్లి ఇంటికి ఆలస్యంగా వచ్చింది. ఎందుకు ఆలస్యమైందని భర్త లక్ష్మణ్ అడగడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆ తర్వాత భర్త బయటకు వెళ్లాడు. తిరిగివచ్చే సరికి భార్య ఇంట్లో దులానికి ఉరేసుకుంది. గంగుబాయి తండ్రి దేవాజీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

18న కలెక్టరేట్ ఎదుట ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మానందం

నస్పూర్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ఈ నెల 18న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.బ్రహ్మానందం తెలిపారు. శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయంలో ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం శ్రీరాంపూర్ ఏరియా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అమలు చేస్తున్న ప్రమాద, సహజ మరణ, శాశ్వత, పాక్షిక అగవైకల్యం వంటి నాలుగు పథకాలను ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించే ప్రయత్నాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశా రు. డిమాండ్ల సాధనకు జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 23న చలో హైదరాబాద్ కార్యాక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నేదురి నర్సయ్య, మంతెన లక్ష్మయ్య, సుగుణ, లక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

తనయుడి చేతిలో తండ్రి హతం

- చికిత్స పొందుతూ మృతి
- ఆస్తిపంపకం విషయమై గొడవ

ఉట్నూర్‌రూరల్: ఆస్తి కోసం తనయుడు తండ్రిని హతమార్చిన ఘటన మండలంలోని రాజన్నగూడెంలో చోటుచేసుకుంది. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం..రాజన్నగూడెనికి చెందిన భాగ్యవాన్..ఆస్తి పంపకం విషయమై తండ్రి భూమన్న (65)తో కొన్నిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై గత ఆగస్టులో తండ్రితో గొడవపడి దాడి చేశాడు. తండ్రి ఫిర్యాదుతో స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. మూడు రోజుల క్రితం తనయుడు ఇనుప రాడ్‌తో తండ్రి ముఖంపై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పత్తిలో పిండినల్లి

- కాండం, కొమ్మలను పీల్చే పురుగు
- నివారణ చర్యలతోనే అరికట్టవచ్చు



పత్తిని ఆశించిన పిండినల్లి



పత్తి పంట

చెన్నూర్‌రూరల్: పత్తి పంటల్లో చీడపీడను ఆశించే పిండినల్లి పురుగులు ప్రధానమైంది. ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు ఈ పంటలకు పురుగులు ఆశిస్తుంటాయి. ఇవి చిన్నవిగా ఉండి మెత్తగా, లేత గులాబీ రంగులో ఉంటాయి. పత్తి కొమ్మలు, కాండం, మొగ్గలు కాయల నుంచి రసాన్ని పీల్చుతాయి. దీని ద్వారా మొక్కల్లో సాధారణంగా జరిగే ఆవశ్యక మూలకాలు, పదార్థాల సరఫరాలో అంతరాయం ఏర్పడి మొక్కలు ఎదగక గిడసబారిపోతాయి. కణుపుల మధ్య దూరం తగ్గి మొక్క గుబురుగా చిన్నదిగా కనిపిస్తుందని, దీని నివారణకు చర్యలు చేపట్టాలని ఏవో మార్క్‌గ్లాడ్‌స్టన్ సూచిస్తున్నారు.

పిండినల్లి ఆశించే విధానం..
పిండినల్లి పురుగులు..పొలంగట్లపై అలాగే పనికిరాని భూముల్లో పెరిగే కలుపు మొక్కల ద్వారా వ్యాపిస్తాయి. బెండ, టమాట, వంగ, క్యాబేజీ, బొప్పాయి, నిమ్మ, జామ, మందార, గోగు, చామంతి, గడ్డి చామంతి, రామబాణం, వయ్యారిభామ, తుత్తర బెండ, సీతాఫలం, సుబాబుల్, గ్లెరిసిడియా వంటివి పిండినల్లికి అతిథి మొక్కలు. అధిక సంతానోత్పత్తి, అల్ప జీవితకాలం, ఈ పురుగు సాధారణంగా ఏడాదిలో 15 తరాలకు అభివృద్ధి చెందగలదు. ఆడ పురుగు పెట్టే ఒక గుడ్ల సంచిలో దాదాపు 600 వరకు గుడ్లు ఉంటాయి. పొలంలో సహజంగా పెరిగే మిత్ర పురుగులు అంతరించిపోవడంతో పురుగు విసర్జించే తేనె వంటి ద్రవం కోసం వచ్చే చీమల ద్వారా ఒక మొక్క నుంచి మరో మొక్కకు పురుగు వ్యాపిస్తుంది. ఈ పురుగు..పంట ఉత్పత్తులు, పత్తి కర్రల ద్వారా గాలి, నీటి కాలువలు, వర్షం, పక్షులు, పశువుల ద్వారా వ్యాపిస్తుంది.

నివారణ చర్యలు..
పిండినల్లి పురుగులు మొదటగా గట్ల పక్కన ఉండే పత్తి వరుసల్లో అక్కడక్కడ ఆశించి తర్వాత మిగతా మొక్కలకు వ్యాపిస్తాయి. ఈ దశలో పురుగు ఆశించిన మొక్కలను పీకి కాల్చివేయాలి. ఇలా చేయడం ద్వారా దాని విస్తరణను అదుపులో ఉంచవచ్చు. పొలం గట్లపైన ఉండే కలుపు మొక్కలు ముఖ్యంగా వయ్యారిభామ, తుత్తురబెండ, గడ్డిచామంతి, తదితర కలుపు మొక్కలను పీకి కాల్చివేయాలి. జైగోగ్రామ బైకోలరేట్ మిత్ర పురుగులను హెక్టార్‌కు 500–1000 వరకు విడుదల చేయాలి. తద్వారా వయ్యారిభామ, కలుపు మొక్కలను నివారించవచ్చు. దీని ద్వారా పిండినల్లి ఉధృతి తగ్గించవచ్చు. పత్తి ఏరిన తర్వాత ఎండు కర్రలను పీకి కాల్చివేయాలి. వేసవి దుక్కులు ద్వారా నేలలో దాగి ఉండే పిల్ల పురుగులను నియంత్రించవచ్చు. అంతర పంటగా అలసంద, బబ్బెర, సోయాబీన్, మినుము తదితర పంటలను సాగు చేయడం ద్వారా మిత్ర పురుగుల సంఖ్యను ఏ వృద్ధి చేయవచ్చు. కంచె పంటగా లేదా రక్షక పంటగా రెండు వరుసల సజ్జ లేదా కందులను దట్టంగా పెంచాలి. దీని ద్వారా పత్తిలో పిండినల్లి ఉధృతి తగ్గించుకోవచ్చును. మొక్కలను పురుగు ఆశించినట్లయితే లీటరు నీటిలో 10 మి.లీ వేపనూనెతోపాటు ఒక గ్రాము సబ్బు పొడిని కలిపి 10 నుంచి 12 రోజుల తేడాతో మొక్క కాండం, కొమ్మలు, ఆకులపై అలాగే చుట్టూపక్కల మొక్కలపైన పిచికారి చేయాలి. మోనోక్రోటోఫాస్ నీరు 1:4 నిష్పత్తిలో కలిపిన ద్రావణాన్ని పంట విత్తిన 20, 40, 50 రోజుల వ్యవధిలో మొక్కల లేత కాండాలపై బ్రష్‌తో పిచికారి చేసినట్లయితే పిండినల్లిని సమర్థవంతంగా అరికటవచ్చు. తద్వారా మంచి దిగుబడి పొందవచ్చు.

జైనూర్‌కు వెళ్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అరెస్టు



డీఎస్పీతో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: జైనూర్ ఘటనలో బాధితులను పరామర్శించేందుకు ఆదివారం వెళ్తున్న ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ నేతలను ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు అరెస్టు చేశారు. ప్రజాప్రతినిధులుగా వెళ్తున్న తమకు అనుమతి ఇవ్వాలని కోరగా నిషేధాజ్ఞల నేపథ్యంలో అనుమతి లేదని డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలి స్పష్టం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, జాతీయ నాయకులు రితేశ్ రాథోడ్, కొండేరి రమేశ్, నాయకులు రవీందర్, కౌన్సిలర్ ప్రవీణ్, అశోక్‌రెడ్డి, గణేశ్ తదితరులు ఉన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లు దేశసేవ చేయాలి

ఆదిలాబాద్: ఎన్‌సీసీ కేడెట్లు దేశసేవ చేయాలని ఉమ్మడి జిల్లా ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ వికాస్‌శర్మ అన్నారు. జిల్లాకేంద్రంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో తెలంగాణ 32 బెటాలియన్ సీఏటీసీఐ శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ వరకు ఎన్‌సీసీ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులో ఉమ్మడి జిల్లాకు చెందిన 600 మంది కేడెట్లు పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఓలు జగ్గరాం, గాలి అశోక్, స్వామి, పూర్ణచందర్, రజిత, రాజేశ్వరి, శ్రీనివాస్, సాయినాథ్, వినోద్, ఉమేష్ కుమార్ పాల్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు అధికారులను మోసం చేసిన వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బన్సిలాల్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులను మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బన్సిలాల్ తెలిపారు. పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. గతనెల 3న గుర్తుతెలియని వ్యక్తి మాస్క్ ధరించి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు వచ్చి క్యాష్ కౌంటింగ్ మిషన్ రిపేర్ చేస్తానని చెప్పి రూ.50 వేలు నగదుతో పారిపోయాడు. బ్యాంక్ మేనేజర్ ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. సీఐతోపాటు ఎస్సై వినిత సీసీ పుటేజీ ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుడు రోహిత్ బాబులాల్ ప్రకాశ్‌కాలేను ఆదివారం పట్టుకున్నారు. నిందితుడు మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా పని గ్రామానికి చెందిన వ్యక్తి. కుటుంబ సభ్యులతో కలిసి గతకొన్నేళ్లుగా సికింద్రాబాద్‌లో ఉంటున్నాడు. గతంలో క్యాష్ కౌంటర్ మిషన్లు, ప్రింటింగ్, జిరాక్స్ మిషన్లు రిపేరు చేసేవాడు. కొంత కాలంగా జులాయిగా తిరుగుతుండేవాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో మెదక్, మంచిర్యాల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో అధికారులను నమ్మించి మోసాలకు పాల్పడుతున్నాడు. మంచిర్యాలలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు వచ్చి క్యాష్ కౌంటింగ్ మిషన్ రిపేరు చేసినట్లు చేసి అధికారులను కౌంటింగ్ నిమిత్తం రూ. 50వేలు ఇవ్వాలని అడిగి వాటితో పరారయ్యాడు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నిండుగా 'ఎల్లంపల్లి'

మంచిర్యాలరూరల్(హాజీపూర్):ఎల్లంపల్లి పూర్తిస్థాయి నీటిమట్టంతో జలకళ సంతరించుకుంది. ప్రస్తుతం ప్రాజెక్టు మొత్తం 20.175 టీఎంసీలకుగాను 20.175 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఎగువ నుంచి 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఔట్‌ఫ్లో కింద 5 గేట్లు తెరిచి 14 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. హైదరాబాద్ మెట్రో వాటర్‌వర్క్స్ పథకానికి 305 క్యూసెక్కులు,ఎన్టీపీసీకి 121 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.



పూర్తిస్థాయి నీటిమట్టంతో ఎల్లంపల్లి జలాశయం